ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

బుధవారం | జూన్ 10, 2026 | సంపుటి : 7 | సంచిక : 11 | పేజీలు : 2

## ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

- కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అవగాహన వర్క్‌షాప్ నిర్వహణ



2 లో

ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ మోహన్‌నాయక్ ఇంట్లో

# ఏసీబీ సోదాలు



- రెండున్నర కిలోలకుపైగా బంగారం, రూ.60లక్షల నగదు గుర్తింపు
- వ్యవసాయ భూమి, ఖాళీ స్థలాలు, అపార్టుమెంట్లు, ఫామ్ హౌస్‌లు, విల్లాలు
- ఏకకాలంలో 15 ప్రాంతాల్లో తనిఖీలు

2 లో





ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్‌నాయక్ ఇంట్లో ఏసీబీ అధికారులు భారీ ఆస్తులు గుర్తించారు. సోదాల్లో దాదాపు రూ.200 కోట్ల ఆస్తులు ఉన్నట్లు గుర్తించిన ఏసీబీ.. మోహన్‌నాయక్ ఇంట్లో రూ.60 లక్షల నగదుతో పాటు రెండున్నర కిలోల బంగారు ఆభరణాలు గుర్తించింది. న హైదరాబాద్‌లో పలు ప్లాట్లు, నిజామాబాద్‌లో వ్యవసాయ భూమి గుర్తింపు, అత్యంత ఖరీదైన విల్లా, ఖాళీ స్థలాలు, శివారులో ఫామ్ హౌజ్‌లు గుర్తించింది.




## ధాన్యం సేకరణలో తెలంగాణ రికార్డు

- 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం
- పక్క రాష్ట్రాలు మా కన్నా తక్కువ కొన్నాయి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, ఆయుధం:** రాష్ట్రంలో 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇన్ని టన్నుల ధాన్యం సేకరణ దేశంలోనే రికార్డు అని తెలిపారు. రూ.35,077 వేల కోట్లు రైతుల ఖాతాలో వేశామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. 65.91 లక్షల ఎకరాల్లో 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండిందని, 52 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని కేంద్రం చెప్పిందని అన్నారు. 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మరో లక్ష మెట్రిక్ టన్నులు వారంలో వస్తాయని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లపై మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు.

**53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు**

దేశంలో పండే వరిలో 61 శాతం తెలంగాణలోనే ఉందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. పక్కరాష్ట్రం 25 లక్షల మెట్రిక్ టన్నుల వరి మాత్రమే కొనుగోలు చేసిందని, యాసంగి పంటలో పక్క రాష్ట్రాలు తమ కన్నా తక్కువ కొన్నాయని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ద్వారా మహిళా సంఘాలు, పీఏసీలను బలపరుస్తున్నామని, మహిళా సంఘాల ద్వారా 53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయించామని, రూ.171 కోట్లు మహిళా సంఘాలకు ఇచ్చామని వెల్లడించారు. పీఏసీల ద్వారా 90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని వివరించారు.





## బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై రైతులను వంచిస్తున్నాయి

- పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పులపాలు చేశారు
- రాష్ట్రం కొంటున్న ధాన్యాన్ని కేంద్రం ఎఫ్‌సీఐ ద్వారా ఎందుకు కొనదు?
- హరీష్ రావు రోజుకో అబద్ధాన్ని సృష్టిస్తూ వార్తల్లో ఉండాలని చూస్తున్నారు
- నిరంతరం ప్రజల కోసమే పనిచేసే ప్రభుత్వం 'ఇందిరమ్మ రాజ్యం'
- త్వరలోనే కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా
- బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

2 లో

జనగామ, ఆయుధం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై రైతులను, ప్రజలను వంచిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం పల్లగుట్ట గ్రామంలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం చేస్తోన్న రికార్డు స్థాయి ధాన్యపు కొనుగోళ్లు, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని నిప్పులు చెరిగారు.

## రెండేళ్లలో.. తెలంగాణకు ఏం చేశారు?



- రేవంత్ రెడ్డికి పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల, మూసి ప్రక్షాళన ఏటీఎంలు
- మూసి ప్రక్షాళనకు వ్యతిరేకం కాదు.. గాంధీ సారోవర్ ప్రాజెక్టుకే వ్యతిరేకం
- రైతుల సమస్యలు పట్టించుకోకుండా తప్పుడు సమాచారం
- ధాన్యం కొనుగోలు కేంద్రం కేంద్రం నిర్వహించదు
- కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రం రీయింబర్స్‌మెంట్ ఇస్తుంది
- దేశంలో కొనుగోలు చేసిన ధాన్యంలో 50% తెలంగాణ నుంచే కొనుగోలు చేశామని వ్యాఖ్య
- ధాన్యం దిగుబడి అంచనాల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- కేంద్రానికి సరైన ఇండెంట్ పంపలేదు
- బీజేపీ నేతలపై రేవంత్ రెడ్డి అనవసర వ్యాఖ్యలు
- ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు బీజేపీ పోరాటం
- బీజేపీ స్టేట్ చీఫ్ ఎన్.రామచందర్ రావు

**యాదాద్రిభువనగిరి, ఆయుధం:**

తాము మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదని.. లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ, పేద కుటుంబాలు, మధ్యతరగతి కుటుంబాలు, మాజీ సైనికులు, తమ జీవితకాల పొదుపులతో ఇళ్లు నిర్మించుకున్న సామాన్య ప్రజలను నిర్వాసితులను చేసే గాంధీ సరోవర్ ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీజేపీ స్టేట్ చీఫ్ ఎన్.రామచందర్ రావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన యాదాద్రి భువనగిరిలో మీడియాతో మాట్లాడుతూ..
తెలంగాణ వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాస్తవాలను దాచిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ''దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోళ్లు చేపట్టింది. తెలంగాణ నుంచి కూడా గణనీయమైన పరిమాణంలో ధాన్యం కొనుగోలు జరిగింది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వంపై ఆధారంలేని ఆరోపణలు చేయడం అత్యంత దురదృష్టకరం. సాధారణ కుటుంబం నుంచి, ఓబీసీ నేపథ్యం నుంచి వచ్చిన వ్యక్తి దేశ ప్రధానమంత్రి స్థాయికి ఎదగడాన్ని కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేకపోతోంది. దేశాన్ని పాలించే హక్కు ఒక్క కుటుంబానికే ఉందనే మనస్తత్వంతోనే కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ పనిచేస్తోంది. కానీ భారతీయ జనతా పార్టీ మాత్రం ఒకే మిగతా 2లో..



## మీనాక్షి నటరాజన్‌కు షాక్..

- రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ

**హైదరాబాద్, ఆయుధం:** తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు గట్టి షాక్ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి ఆమె రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ వేయగా.. రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. కేసుల వివరాలను ఆమె అఫిడవిట్‌లో వెల్లడించకుండా దాచిపెట్టినందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. మీనాక్షి నటరాజన్ కేసుల వివరాలను దాచిపెట్టినట్లు భాజపా చేసిన ఫిర్యాదు మేరకు రిటర్నింగ్ అధికారి ఆమె నామినేషన్ తిరస్కరించారు.



## కువైట్ పాలకులకు ప్రధాని మోదీ ఫోన్

**ఢిల్లీ, ఆయుధం:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ప్రధాని మోదీ కువైట్ పాలకులకు ఫోన్ చేశారు. కువైట్ యువరాజు (అమీర్) షేక్ మెషల్ అల్ అహ్మద్ అల్ జబీర్ అల్ సబాతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆ దేశంపై ఇరాన్ చేసిన దాడులను ఖండించారు. అక్కడి భారతీయుల క్షేమ సమాచారం గురించి ఆరా తీశారు. ఆ ప్రాంతంలో శాంతి పునరుద్ధరణ కోసం దౌత్య పరిష్కారాలు కనుగొనాలని మోదీ పిలుపునిచ్చారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడంపై మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారని.. కువైట్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతపై జరుగుతున్న దాడులను భారత్ తీవ్రంగా ఖండిస్తోందని ప్రధానమంత్రి కార్యాలయం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఇటీవల కువైట్, బహ్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై ఇరాన్ డ్రోన్ దాడులకు పాల్పడింది. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంపై టెహ్రాన్ చేసిన దాడిలో ఓ భారతీయుడు ప్రాణాలు కోల్పోగా పదుల సంఖ్యలో ప్రయాణికులు, సిబ్బంది గాయపడ్డారు. మార్చిలోనూ కువైట్‌లోని ఓ విద్యుత్ నీటి శుద్ధి కర్మాగారంపై జరిగిన డ్రోన్ దాడిలో ఓ భారతీయుడు ప్రాణాలు కోల్పోయాడు.



## యువతకు స్ఫూర్తిగా చిన్నబోయినపల్లి లైబ్రరీ

- కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు.

**ములుగు, ఆయుధం:** చిన్నబోయినపల్లి గ్రామ యువతకు పోటీ పరీక్షల సన్నద్ధతలో అండగా నిలుస్తున్న గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు మంగళవారం పరిశీలించారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, యువత వినియోగం, సాధించిన ఫలితాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ ధూపాటి సతీష్ 2024 సంవత్సరంలో గ్రామీణ యువతకు నాణ్యమైన అధ్యయన వనరులు అందించాలనే లక్ష్యంతో స్వచ్ఛందంగా ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి వేలాది రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకోలేని నిరుద్యోగ యువతకు గ్రామంలోనే పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. గ్రంథాలయంలో సుమారు రూ.1.50 లక్షల విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచారు. గ్రూప్స్, పోలీస్, రైల్వే, బ్యాంకింగ్, ఉపాధ్యాయ నియామకాలు తదితర ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన అధ్యయన సామగ్రిని యువత ఉచితంగా వినియోగించుకుంటున్నారు. ఈ గ్రంథాలయం ద్వారా చదువుకున్న యువతలో ఇద్దరు ఉపాధ్యాయులు, ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లు ప్రభుత్వ

## స్టేషన్ ఘనపూర్‌లో రూ.60.62 కోట్ల విద్యుత్ అభివృద్ధి పనులకు శ్రీకారం

**స్టేషన్ ఘనపూర్, ఆయుధం:** జనగామ జిల్లా ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలో రూ.60.62 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు విద్యుత్ అభివృద్ధి పనులకు సంబంధించిన నూతన సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేస్తోందన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం పేద కుటుంబాలకు ఎంతో మేలు చేస్తోందని తెలిపారు. ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గం అభివృద్ధి పరంగా రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.
ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు వల్ల రైతులు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఒకప్పుడు వలసలకు కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతం దేవాదుల ప్రాజెక్టు, ఉచిత విద్యుత్ సౌకర్యాలతో వ్యవసాయ రంగంలో గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రఘునాథపల్లి



132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులకు నిధులు కేటాయించాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు.
జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, రైతులు మరియు ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ, రూ.60.62 కోట్ల వ్యయంతో ఘనపూర్ నియోజకవర్గంలో పలు విద్యుత్ సబ్‌స్టేషన్లను ప్రారంభించడం ద్వారా విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. లోడ్ మేనేజ్‌మెంట్ మెరుగుపడి ప్రజలకు నిరంతర విద్యుత్ అందుతుందని చెప్పారు. ట్రాన్స్‌కో అధికారులు కూడా విద్యుత్ రంగ అభివృద్ధి కార్యక్రమాలను అభినందిస్తూ, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.
కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, మామిడాల యశస్విని రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా, కోఆపరేటివ్ చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## తెలంగాణకు భారీ వర్ష సూచన

**హైదరాబాద్, ఆయుధం:** తెలంగాణలో మంగళ, బుధవారాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో నేడు అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. గంటకు 40 నుంచి 50కి.మీ వేగంతో ఈదురుగాలులతో వర్షాలు పడొచ్చని పేర్కొంది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్ జిల్లాలకు మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు తెలిపిన వాతావరణ శాఖ అధికారులు.. కామారెడ్డిలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే, బుధవారం వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.



## ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ మోహన్ నాయక్ ఇంట్లో
# ఏసీబీ సోదాలు

- రెండున్నర కిలోలకుపైగా బంగారం, రూ.60లక్షల నగదు గుర్తింపు
- వ్యవసాయ భూమి, ఖాళీ స్థలాలు, అపార్టుమెంట్లు, ఫామ్ హౌస్‌లు, విల్లాలు
- ఏకకాలంలో 15 ప్రాంతాల్లో తనిఖీలు

**హైదరాబాద్, ఆయుధం:** ఆర్అండ్ బీ ఈఎన్ సీ మోహన్ నాయక్ నివాసంలో ఏసీబీ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. ఆదాయానికి మించి ఆస్తులు కలిగిఉన్నారన్న ఆరోపణల నేపథ్యంలో మోహన్ నాయక్ ఇంటితోపాటు 15 ప్రాంతాల్లోని ఆయన బంధువుల నివాసాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఇవాళ ఉదయం నుంచి తనిఖీలు కొనసాగుతున్నాయని, సోదాలు పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు. అతడి ఇంట్లో 20కి పైగా విదేశీ మద్యం సీసాలను గుర్తించారు.

**ఇంట్లో రూ.60లక్షల నగదు గుర్తించాం.. ఏసీబీ జాయింట్ డైరెక్టర్**

మోహన్ నాయక్ ఇంట్లో చేపట్టిన తనిఖీల్లో రూ. 60లక్షల నగదు గుర్తించినట్లు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. కిలో బంగారు నగలు, 13 బంగారు బిస్కెట్ల గుర్తించినట్లు తెలిపారు. ఏకకాలంలో 15 ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయన్నారు. హైదరాబాద్, నిజామాబాద్ లో ఇళ్ల స్థలాల పత్రాలు గుర్తించామని తెలిపారు. మరోవైపు, మోహన్ నాయక్ కార్యాలయంలోనూ ఏసీబీ సోదాలు జరిపింది. ఎర్రమంజిల్లోని కార్యాలయంలో పలు ఫైళ్లను తనిఖీ చేస్తున్నారు. అక్కడి అధికారుల నుంచి కూడా వివరాలు సేకరిస్తున్నారు. అతడి ఆస్తుల విలువ రూ.100 కోట్లకు పైనే ఉంటుందని ఏసీబీ అంచనా వేస్తోంది.



# రెండేళ్లలో తెలంగాణకు ఏం చేశారు?


(మొదటి పేజీ తరువాయి..)

లక్ష్యంతో పనిచేస్తుంది — దేశానికి, ప్రజలకు సేవ చేయడం. ఎంఎంటీఎస్, మెట్రో ప్రాజెక్టుల విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ సహకార దృక్పథంతోనే వ్యవహరించింది. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన ప్రతి విషయంలో కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ముందుకు వచ్చింది.

కానీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పలు కీలక అంశాలపై ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయి. వన్ నేషన్, వన్ ఎలక్షన్, రిజర్వేషన్లు వంటి అంశాల్లో ఈ రెండు పార్టీలు ఒకే వైఖరిని అవలంబించాయి. తెలంగాణలో బీజేపీ బలం రోజురోజుకూ పెరుగుతుండటంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు భయపడుతున్నాయి. అందుకే ప్రజల ముందు వేరువేరుగా కనిపించినా, బీజేపీని ఎదుర్కొనే విషయంలో ఈ రెండు పార్టీలు కలిసికట్టుగా పనిచేస్తున్నాయి. దేశాన్ని ఒకే కుటుంబం మాత్రమే పాలించాలి అనే మనస్తత్వంతో కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోంది. కానీ భారతీయ జనతా పార్టీ మాత్రం దేశసేవే పరమ లక్ష్యంగా పనిచేస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి, సుశాసనం, ప్రజా సంక్షేమం దిశగా ముందుకు సాగుతోంది. కానీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని ప్రజల సేవ కోసం కాకుండా, కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంలా మార్చేశారనే భావన ప్రజల్లో రోజురోజుకూ బలపడుతోంది. రేవంత్ రెడ్డి తరచుగా బీజేపీ నాయకులు తెలంగాణకు ఏమి చేశారని ప్రశ్నిస్తున్నారు. రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు ఏమి చేసింది?'' అని రామచందర్ రావు సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు.

రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు తీసుకురాలేదు. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల బకాయిలను చెల్లించలేదు. రైతు భరోసాను సక్రమంగా అమలు చేయడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి జీతాలు అందడం లేదు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లేవు. రాష్ట్రంలో పెట్టుబడులు లేవు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీజేపీపై విమర్శలు చేయడం తప్ప, తెలంగాణ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమిటి? రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. ఏప్రిల్ నెలలోనే బీజేపీ నాయకులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అయినప్పటికీ ప్రభుత్వం సమయానికి స్పందించకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ "చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం" అని హామీ ఇచ్చింది. కానీ నేడు ఆ హామీని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైంది. ధాన్యం కొనుగోలు బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదే. కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన రీయింబర్స్‌మెంట్ లు, గోదాం ఛార్జీలు, రవాణా ఖర్చులు సహా ఇతర వ్యయాలను కేంద్ర ప్రభుత్వం భరిస్తోంది. అయినా కూడా రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను తప్పించుకునే ప్రయత్నం చేయడం రైతులను మోసం చేయడమే.'' అని రామచందర్ రావు పేర్కొన్నారు.

## యంగ్ ఇండియా హైస్కూల్ మంజూరు చేయండి



**హైదరాబాద్, ఆయుధం;** జనగామలో ఇంటిగ్రేటెడ్ హైస్కూల్, కాకతీయ ఇంజనీరింగ్ కాలేజ్ స్థాపన కొరకు అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయని.. ప్రభుత్వం మంజూరు చేస్తే నిరుపేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి పేర్కొన్నారు. మంగళవారం ఆయన హైదరాబాదులోని మహాత్మ జ్యోతిరావు పూలే భవనంలో ప్రజావాణి లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చెన్నారెడ్డి కలిసి వినతిపత్రం అందించారు. గతంలో ఏటీసీ మంజూరుకు తన వంతు సహకారం అందించి మంజూరు చేయించినందుకు చిన్నారెడ్డిని సన్మానించారు. ప్రతిసారి ఏదో ఒక విద్యాసంస్థ కావాలని తమ దగ్గరికి వస్తున్నావని.. నీ తపనకు అభినందిస్తున్నానట్లు తెలిపారు. కాగా, జనగామ కు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ హైస్కూల్,కాకతీయ ఇంజనీరింగ్ కాలేజ్ మంజూరు విషయములో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## యువతకు స్ఫూర్తిగా చిన్నబోయినపల్లి లైబ్రరీ

(మొదటి పేజీ తరువాయి..)

ఉద్యోగాలు సాధించారు. అలాగే చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన హజారుద్దీన్ ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై గ్రామ యువతకు ఆదర్శంగా నిలిచారు. గ్రామీణ ప్రాంత యువత అభివృద్ధికి ధూపాటి సతీష్ చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. వ్యక్తిగత చొరవతో విద్య, ఉపాధి అవకాశాల కోసం చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. యువత తమ లక్ష్యాలను సాధించేందుకు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ధూపాటి సతీష్ గ్రంథాలయ నిర్వహణ, యువతకు అందిస్తున్న సేవల గురించి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లా కలెక్టర్ ఆయనను అభినందించి, భవిష్యత్తులో మరింత మంది యువతకు ఉపయోగపడే విధంగా గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు.





# బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై రైతులను వంచిస్తున్నాయి

- పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పులపాలు చేశారు
- రాష్ట్రం కొంటున్న ధాన్యాన్ని కేంద్రం ఎఫ్‌సీఐ ద్వారా ఎందుకు కొనడం లేదు?
- హరీష్ రావు రోజుకో అబద్ధాన్ని సృష్టిస్తూ వార్తల్లో ఉండాలని చూస్తున్నారు
- నిరంతరం ప్రజల కోసమే పనిచేసే ప్రభుత్వం 'ఇందిరమ్మ రాజ్యం'
- త్వరలోనే కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల ఉచిత బీమా
- రాష్ట్రంలో ఒకే విడతలో రూ. 22 వేల కోట్ల రైతు రుణమాఫీ
- రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధికి రూ. 60 కోట్లతో పనులు
- బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి



**జనగామ, ఆయుధం:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై రైతులను, ప్రజలను వంచిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం పల్లగుట్ట గ్రామంలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం చేస్తోన్న రికార్డు స్థాయి ధాన్యపు కొనుగోళ్లు, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని నిప్పులు చెరిగారు.

**రూ. 8 లక్షల కోట్ల అప్పులు చేసి.. రాష్ట్రాన్ని దోపిడీ చేశారు!**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రాష్ట్ర సంపదను, వనరులను విచ్చలవిడిగా దోపిడీ చేసిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. "ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను రూ. 8 లక్షల కోట్ల అప్పుల్లో ముంచేసి వెళ్లారు. ఆ పాపానికి ఇప్పుడు మా కాంగ్రెస్ ప్రభుత్వం ఏటా రూ. 76 వేల కోట్ల రూపాయలను అసలు, వడ్డీల రూపంలో బ్యాంకులకు కట్టాల్సి వస్తోంది. ఆ అప్పులే లేకపోయి ఉంటే ఈ రూ. 76 వేల కోట్లను ప్రజల సంక్షేమానికి అందించి రాష్ట్ర దశ, దిశ మార్చేవాళ్లం" అని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల సొమ్మంతా గత పాలకుల ఇళ్లకే పోయిందని, అందుకే పదేళ్లలో పేదలకు సన్నబియ్యం గానీ, ఇందిరమ్మ ఇళ్లు గానీ ఇవ్వలేకపోయారని ఎద్దేవా చేశారు.

**డిస్కంలను ముంచేసింది మీరు కాదా?: బీఆర్ఎస్‌కు సూటి ప్రశ్న**

పదేళ్ల పాటు ఉచిత కరెంట్ ఇస్తున్నామని బీఆర్ఎస్ నేతలు గప్పాలు కొట్టుకున్నారే తప్ప, డిస్కంలకు సకాలంలో బిల్లులు చెల్లించకుండా వాటిని అప్పుల పాలు చేశారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. "మీరు చేసిన తప్పుల వల్ల డిస్కంలు ఆదాయం లేక, క్వాలిటీ పవర్ ఇవ్వలేక ఇబ్బంది పడ్డాయి. కానీ, మా ప్రభుత్వం వచ్చాక రైతులు కట్టాల్సిన రూ. 14 వేల కోట్లను, పేదల ఉచిత కరెంట్ (గృహజ్యోతి) బిల్లు రూ. 5 వేల కోట్లను.. మొత్తంగా రూ. 19 వేల కోట్లను ప్రతి నెల ఆర్థిక శాఖ ద్వారా నేరుగా డిస్కంలకు చెల్లిస్తూ క్వాలిటీ పవర్ ఇస్తున్నాం. దీనిపై కూడా అభాండాలు వేయడం బీఆర్ఎస్ దిగజారుడుతనానికి నిదర్శనం" అని స్పష్టం చేశారు.

**హరీష్ రావు రోజుకో అబద్ధం**

"ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మా క్యాబినెట్ రోజుకు 18 గంటలు ప్రజా సంక్షేమం కోసం శ్రమిస్తుంటే.. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీష్ రావు కేవలం వార్తల్లో ఉండటం కోసం రోజుకొక అబద్ధపు వార్తను సృష్టిస్తున్నారు. గాలి కబుర్లు పోగేసి ప్రభుత్వంపై అవాకులు చవాకులు పేలుతున్నారు. అధికారం పోయిందనే తట్టుకోలేక కట్టుకథలు అల్లుతున్నారు" అని హరీష్ రావుపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రైతులను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేసిన బీజేపీ!**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కూడా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా రైతులను కార్పొరేట్ శక్తుల దయాదాక్షిణ్యాల మీద వదిలేయాలని కేంద్రం చూస్తోందని ఆరోపించారు. "మద్దతు ధర (MSP) ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం.. మరి రాష్ట్రాలు కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని ఎఫ్ సి ఐ (FCI) ద్వారా ఎందుకు సేకరించడం లేదు? గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఎఫ్‌సీఐ ద్వారా కేంద్రమే కొనుగోలు చేసేది. ఇప్పుడెందుకు ఆ వ్యవస్థను నిర్వీర్యం చేశారు?" అని సూటిగా ప్రశ్నించారు. కేంద్రం కొన్నా, కొనకపోయినా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల శ్రమను గౌరవిస్తూ చివరి ధాన్యపు గింజ వరకూ కొంటుందని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలోనైనా మద్దతు ధరతో మొక్కజొన్నలు కొంటున్నారా అని ప్రశ్నించిన ఆయన, కేవలం తెలంగాణలోనే మొక్కజొన్నను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసిందని గుర్తు చేశారు.

**'తగుదునమ్మా' అంటూ కల్లాల్లోకి వస్తారా?**

రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున ఇన్ని వేల కోట్లు ఖర్చు పెట్టి రబీ సీజన్‌లో రికార్డు స్థాయిలో 72.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తుంటే.. 'తగుదునమ్మా' అంటూ బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కల్లాల్లోకి వస్తాం, రైతుల కన్నీళ్లు తుడుస్తాం అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. "ఇన్ని రోజులు మీరెక్కడికి పోయారు? వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేసిన చరిత్ర మా కాంగ్రెస్ ప్రభుత్వానిది" అని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఒకే విడతలో రూ. 22 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ఘనత తమదేనని, విమర్శలు మాని దమ్ముంటే కేంద్రం చేత ధాన్యం కొనుగోలు చేయించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు.

**పేదల గృహనిర్మాణానికి పెద్దపీట**

గత ప్రభుత్వం 'డబుల్ బెడ్‌రూమ్' పేరుతో పేదలను వంచించిందని భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, తొలి విడతగా రూ. 22,500 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున సాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ప్రతి నియోజకవర్గానికి అదనంగా మరో 2,000 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఇల్లే లేని నిరుపేద కుటుంబం ఉండకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు.

**మహిళా సాధికారతకు అండ**


మహిళా సంఘాలకు రెండున్నరేళ్లలోనే రూ. 67 వేల కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు ఇప్పించామని, ఐదేళ్లలో ఈ మొత్తాన్ని రూ. 1.25 లక్షల కోట్లకు పెంచుతామని భట్టి విక్రమార్క వెల్లడించారు. మహిళా సంఘాలే స్వయంగా బస్సులు కొనుగోలు చేస్తే, వాటిని ఆర్టీసీలో తిప్పి వారికి స్థిరమైన ఆదాయం కల్పించే వినూత్న కార్యక్రమాన్ని దిగ్విజయంగా అమలు చేస్తున్నామని వివరించారు.

**స్థానిక సమస్యలపై సానుకూల స్పందన**

సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరిన పలు అభివృద్ధి పనులపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. రఘునాథపాలెంలో 232 కేవీ సబ్‌స్టేషన్ అప్‌గ్రేడేషన్‌పై తక్షణమే సాధ్యసాధ్యాల పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామాల్లో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న కరెంట్ లైన్ల మార్పిడి పనుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తానని సభాముఖంగా మాట ఇచ్చారు. గతంలో పక్కనబెట్టిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తోందని, ఈ నియోజకవర్గానికి కూడా సబ్‌ప్లాన్ నిధులు వస్తాయని పేర్కొన్నారు.


## ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

- కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అవగాహన వర్క్‌షాప్ నిర్వహణ




**వరంగల్, ఆయుధం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ – ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, హనుమకొండ జిల్లా కలెక్టర్ మరియు ఇన్‌చార్జి బల్దియా కమిషనర్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు - 2026 పై బల్దియా ప్రధాన కార్యాలయ కౌన్సిల్ హాల్ లో మంగళవారం అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ శాస్త్రవేత్త బి. జీమూత వాహన మాట్లాడుతూ, ఘన వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని గణనీయంగా నియంత్రించవచ్చని తెలిపారు. ప్రతి ఇంటి వద్ద ఉత్పత్తి అయ్యే ఘన వ్యర్థాలను తడి, పొడి, గృహ ప్రమాదకర వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలు అనే నాలుగు విభాగాలుగా తప్పనిసరిగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. బల్దియా ముఖ్య వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. బొమ్మన రాజా రెడ్డి, వైద్య ఆరోగ్య అధికారి డా. రాజేష్, మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణను మరింత పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏకవినియోగ ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా సహజసిద్ధమైన, పర్యావరణహిత ఉత్పత్తులను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రమైన పరిసరాల నిర్మాణం, సుస్థిర వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించడమే ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది మున్సిపల్ సిబ్బంది, వార్డ్ జవాన్లు, స్వచ్ఛ భారత్ మిషన్ సిబ్బంది, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ (ఆర్‌డబ్ల్యూఏలు) ప్రతినిధులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో పలుచోట్ల భారీ వర్షం



**హైదరాబాద్, ఆయుధం:** హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసింది. ఈ జోరు వానతో మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, మియాపూర్ సహా పలు చోట్ల ప్రాంతాల్లో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. పాతబస్తీలో కరెంట్ తీగలు తెగిపడి ఇద్దరు మృతి చెందగా.. ఛత్తాబజార్‌లో చిన్న కమాన్ విరిగిపడింది. అలాగే, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం రహదారులపై వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ వ్యాప్తంగా కురిసిన వర్షం ప్రభావంతో చోటుచేసుకున్నాయి.

హైదరాబాద్ పాతబస్తీ బండ్లగూడలో భారీ వర్షంతో కరెంట్ తీగలు రోడ్డుపై తెగి పడ్డాయి. దీంతో ఇద్దరు యువకులు జాఫర్ (25), అబూ (16) విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయారు.

పాతబస్తీలోని ఛత్తాబజార్‌లో రోడ్డుపై కమాన్ కూలింది. చిన్న కమాన్ కూలిన సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది.

బన్సీలాల్‌పేటలో 8.7 సెం.మీ వర్షపాతం నమోదు కాగా.. విఠల్ వాడీలో 7.8సెం.మీ, హిమాయత్‌నగర్‌లో 7.8 సెం.మీ, విద్యానగర్‌లో 7.3 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

హిమాయత్‌నగర్‌లో రహదారిపై భారీగా వరదనీరు చేరింది. మాదాపూర్ పర్వత్‌నగర్ చౌరస్తా వద్ద వరదనీరు చేరడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది.



మియాపూర్ జేపీ నగర్‌లో రోడ్డుపై వరద నీరు నిలిచిపోయింది. దీంతో వాహనరాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాజేంద్రనగర్‌లోని పాతకర్నూలు రహదారిపై వరదనీరు నిలిచిపోయింది.

భారీ ఈదురుగాలుల తీవ్రతకు హైదరాబాద్‌లో దాదాపు 80 చోట్ల చెట్లు నేలకూలాయి. కొండాపూర్, గచ్చిబౌలి, షేక్‌పేట, మాదాపూర్‌లలో చెట్లు కూలాయి. రాంనగర్ వీఎస్టీ వద్ద ఓ భారీ వృక్షం నేలకూలగా.. హిమాయత్‌నగర్‌లోని ఓ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో చెట్టు నేలకొరిగింది. బాగ్‌లింగంపల్లి సాయిబాబా ఆలయం వద్ద చెట్టు విరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

వరద ప్రభావిత ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటిస్తున్నారు. ట్యాంక్‌బండ్‌పై వరద నీటి మళ్లింపు, కూలిన చెట్ల తొలగింపు చర్యలను ఆయన పర్యవేక్షించారు.

రహదారులపై నిలిచిన వరద నీటిని హైడ్రా డీఆర్‌ఎఫ్ బృందాలు నాలాల్లోకి మళ్లిస్తున్నాయి. భారీ మోటార్ల సహాయంతో వరదనీటి మళ్లింపు చర్యలు చేపడుతున్నాయి. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు.



## డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన పోలీస్ కమిషనర్

**జనగామ, ఆయుధం;** జనగామ జిల్లా, చిల్పూర్ మండలం, పల్లగూడ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవంతో శంకుస్థాపల చేసేందుకు విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలను అందజేశారు.

## పీవోకేలో ఘర్షణలు

- 30 మందికి పైగా మృతి!

**జాతీయం, ఆయుధం:** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పాకిస్థాన్ భద్రతా దళాలు, నిరసనకారులకు మధ్య జరిగిన ఘర్షణల్లో దాదాపు 30 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. వీరిలో పలువురు భద్రతా సిబ్బంది ఉన్నట్లు సమాచారం. ముజఫరాబాద్, రావల్‌కోట్ లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల్లో మొత్తంగా 200 మందికిపైగా గాయపడినట్లు వార్తా కథనాలు వెల్లడిస్తున్నాయి. పీవోకేలో తాజా పరిణామాలపై పాకిస్థాన్ మానవ హక్కుల కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

పీవోకేలో జులై 27న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో స్థానిక చట్టసభలో శరణార్థుల కోసం కేటాయించిన 12 సీట్లను రద్దు చేయాలని కొంతకాలంగా డిమాండ్ చేస్తోన్న జాయింట్ ఆవామీ యాక్షన్ కమిటీ (JAAC).. జూన్ 9న నిరసనలకు పిలుపునిచ్చింది. అయితే జేఏఏసీని నిషేధిస్తున్నట్లు అధికారులు ఇటీవల ప్రకటించారు.

ఈ క్రమంలోనే రావల్‌కోట్ ప్రాంతంలో రెండు రోజుల క్రితం భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఓ వ్యాపారి ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు వచ్చిన జేఏఏసీ నిరసనకారులు స్థానిక ఆసుపత్రి మార్చురీ ముందు భారీ సంఖ్యలో గుమిగూడారు. వీరిని చెదరగొట్టేందుకు భద్రతా దళాలు ప్రయత్నించడం, నిరసనకారులు ఎదురు తిరగడంతో పరిస్థితి హింసాత్మకంగా మారింది. భద్రతా దళాల కాల్పుల్లో అనేక మంది మృతి చెందారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695